కరోనా విజృంభించిన సమయంలో 'ట్రంప్- కిమ్' చిత్తూరు యాసలో మాట్లాడుకునే వీడియోలు సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయ్యాయి. ఈ వీడియోలను చూసిన చాలా మంది లాక్‌డౌన్‌లో రిలాక్సయ్యారు. వాటి వెనుక ఉన్నది మన చిత్తూరు కుర్రాడే. సామాజిక మాధ్యమాల్లో సుమారు 13లక్షలమందికి పైగా ఫాలోవర్స్‌తో దూసుకుపోతున్న తేజ గురించి ప్రత్యేక కథనమిది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి


తేజ

చిత్తూరు యాసను వైరల్ చేశాడు!

- విదేశీ కామెడీ వీడియోలకు చిత్తూరు యాసతో డబ్బింగ్
- సోషల్ మీడియాతో పాటు సినిమాల్లోనూ రాణిస్తున్న తేజ

ఐరాల మండలం పుత్రమద్ది గ్రామానికి చెందిన రైతు దంపతులు సుగుణ, రవి కుమారుడైన తేజ చిత్తూరులోని సీతమ్స్ కళాశాలలో నాలుగేళ్ల క్రితం ఎంబీఏ చేస్తున్నప్పుడు సరదాగా 'చిత్తూరు కుర్రాడు' పేరుతో యూట్యూబ్ ఛానెల్‌ను ప్రారంభించారు.విదేశీ కామెడీ వీడియోలకు చిత్తూరు యాసలో డబ్బింగ్ చెప్పి విడుదల చేసేవారు. అవన్నీ బాగా వైరల్ అయ్యాయి. ముఖ్యంగా కరోనా సమయంలో 'ట్రంప్- కిమ్' చిత్తూరు యాసలో మాట్లాడుకునే వీడియోలు చూసి జనం బాగా నవ్వుకున్నారు. తర్వాత ఆ ఛానెల్‌లో 'ధోని- కోహ్లీ', తాత- మనవడు సిరీస్‌లు బాగా పాపులర్ అయ్యాయి. ఇప్పుడు నడుస్తోన్న ఓబులు సిరీస్ వీడియోలు కూడా బాగా నవ్విస్తున్నాయి.వీటిలో వుండే విదేశీ వ్యక్తులు ఐదుగురికి చిత్తూరు యాసలో తేజ డబ్బింగ్ చెబుతున్నారు.స్వగ్రామంలో జరిగే సంక్రాంతి వేడుకల్లో స్టేజ్ పర్‌ఫార్మెన్స్ ఇస్తూ.. కవర్ సాంగ్స్, షార్ట్ ఫిలిమ్స్ వంటివి కూడా చేసి తేజ పాపులర్ అయ్యారు. చిత్తూరు యాసలో తేజ వీడియోలు చూసి సినిమా వాళ్లు అవకాశాలు ఇవ్వడం మొదలెట్టారు.చిత్తూరుకే చెందిన కో డైరెక్టర్ శ్రావణ్.. తాను పని చేస్తున్న 'ఎస్ఆర్ కళ్యాణ మండపం' సినిమాలో అవకాశం ఇప్పించారు. రాయచోటికి చెందిన కిరణ్ అబ్బవరం హీరోగా చేసిన ఆ సినిమా కరోనా సమయంలో విడుదలై మంచి విజయం సాధించింది. హీరో సీనియర్స్, విలన్ గ్యాంగ్‌లో కన్పించిన తేజకు తరువాత మంచు విష్ణు తన జిన్నా సినిమాకు రైటర్‌గా అవకాశం ఇచ్చారు.దూరదర్శిని సినిమాలో ఫుల్ లెంగ్త్ రోల్ చేయగా ప్రస్తుతం మరో ఐదు సినిమాల్లో నటిస్తున్నారు.


హీరో కిరణ్‌తో


రామ్‌చరణ్‌తో


మంచు విష్ణుతో


ప్రముఖ నిర్మాత అల్లుఅరవింద్ అభినందనలందుకుంటూ

● హీరో కిరణ్ అబ్బవరంతో అనుబంధం

ఎస్ఆర్ కళ్యాణమండపం అనేది హీరో కిరణ్‌కు రెండో సినిమా. చిత్తూరు తేజకు మొదటిది. తేజ తీరు నచ్చడంతో కిరణ్ తన ప్రతి సినిమాలో అవకాశాలిస్తున్నారు. వినరో భాగ్యము విష్ణుకథ, నేను మీకు బాగా కావాల్సినవాడిని, రూల్స్ రంజన్ సినిమాలతో పాటు ఈ దీపావళికి విడుదలై ఘన విజయం సాధించిన 'క' సినిమాలో కూడా తేజ నటించారు.కిరణ్ సినిమాలు విడుదలైతే తేజ దగ్గరుండి మరీ పబ్లిసిటీ బాధ్యత చూసుకుంటుంటారు. తాజా సినిమా క కోసం తిరుపతి, చిత్తూరు, పుత్తూరు, నగరి, బంగారుపాళ్యం, పలమనేరు, మదనపల్లె, కదిరి, హిందూపురం ప్రాంతాల్లోని కాలేజీల్లో విద్యార్థులతో సమావేశమై సినిమా గురించి ప్రచారం చేశారు.

● 13లక్షలకుపైగా ఫాలోవర్స్

ఇప్పుడు సామాజిక మాధ్యమాలే సెలబ్రిటీ స్థాయిని తెలియజేస్తున్నాయి.ఎంత మంది ఫాలోవర్స్ ఉంటే అంత పెద్ద సెలబ్రిటీ అని అర్థం. చిత్తూరు తేజకు వివిధ సామాజిక మాధ్యమాల్లో 13 లక్షలమందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. యూట్యూబ్‌లో 7.50 లక్షలు, ఇన్‌స్టాగ్రామ్‌లో 3.20 లక్షలు, ఫేస్‌బుక్‌లో 1.20 లక్షలు, మోజ్‌లో 1.30 లక్షల మంది ఫాలోవర్స్ ఉండడమంటే సాధారణ విషయం కాదు.

● 'పుష్ప' కేశవకు యాస సాయం

అల్లుఅర్జున్ నటించిన పుష్ప సినిమాకు కూడా చిత్తూరు యాసకు సంబంధించిన కొన్ని పదాలను అందించారు. హీరో అల్లుఅర్జున్ ఫ్రెండ్ క్యారెక్టర్ కేశవ సొంతూరు ఐరాల వచ్చి నాలుగు రోజులు ఉండి తేజ వద్ద శిక్షణ తీసుకున్నారు. పుష్ప విడుదలకు ముందే తేజ వల్ల చిత్తూరు యాస పాపులర్ అయిందని చెప్పవచ్చు.

● చిత్తూరు యాస వ్యాప్తే ప్రధాన లక్ష్యం

ఎంబీఏ వరకు చదువుకున్న తాను సరదాగా ప్రారంభించిన యూట్యూబ్ ఛానెల్ చిత్తూరు యాసతో ఎక్కడికో వెళ్లిపోయిందని తేజ అంటున్నారు. తనకు ఈ యాస వల్లే మంచి గుర్తింపు లభించిందని.. సినిమాల్లో ఈ యాస కోసమే పాత్రలు రాస్తున్నారని ఆయన చెబుతున్నారు. సినిమా రంగంలోనే ఉంటూ చిత్తూరు యాస వ్యాప్తి కోసం కృషి చేస్తానంటున్నారు.



భోజన ప్రియుడు తిరుమల వెంకన్న



- వివరాలు 6వ పేజీలో -

శ్రీవారి దర్శనంతో అద్భుతమైన అనుభూతి

- ప్రముఖ నటి హేమమాలిని



తిరుమల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): సీనియర్ నటి, బీజేపీ ఎంపీ హేమమాలిని తన కుమార్తె ఈషాతో కలసి శనివారం తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డితో కలిసి వారు ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. అనంతరం హేమమాలిని ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తిరుమలకు రావడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు.తిరుమలలో పరిశుభ్రత, ప్రకృతి అందాలు అద్భుతంగా ఉంటాయన్నారు. తాను చాలా సార్లు శ్రీవారిని దర్శించుకున్నానని, ఈసారి మరింత అద్భుతమైన అనుభూతి కలిగిందన్నారు.ఈషా దేవోల్ మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి తాను చాలా సార్లు తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకున్నట్టు తెలిపారు. ఈసారి తన తల్లితో దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.



భయం..భయం..

- చెలరేగిపోతున్న గొలుసు దొంగలు
- రక్షించుకోబోయి ఓ మహిళ మృతి
- బయట తిరగాలంటే భయపడిపోతున్న మహిళలు

మహిళల మెడలో బంగారు గొలుసులు లాక్కెళ్లే ముఠా జిల్లాలో చెలరేగిపోతోంది. గత నెల 26వ తేదీన ఒకేరోజు ఇలాంటివి మూడు ఘటనలు జరిగాయి. శుక్ర, శనివారాల్లో మరో మూడు ఘటనలు చోటు చేసుకున్నాయి.పూతలపట్టులో అయితే తన చైన్‌ను రక్షించుకోబోయిన ఓ మహిళ దొంగల దాడిలో తీవ్రంగా గాయపడి మరణించింది కూడా.మొత్తానికి గొలుసుదొంగల ముఠా జిల్లా పోలీసులకు సవాల్ విసురుతోంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

● 15 నిమిషాల్లో మూడు దొంగతనాలు..

పూతలపట్టు, ఐరాల మండలాల్లో అక్టోబరు 26వ తేదీన మూడు చైన్ దొంగతనాలు 15 నిమిషాల వ్యవధిలో జరిగాయి. చిత్తూరు- పీలేరు హైవేపై కేటీఎం బైకులో వెళ్తా ఇద్దరు యువకులు ఈ దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ మూడు ఘటనలు జరిగి వారం దాటినా పోలీసులు ఆ ముఠాను పట్టుకోలేకపోయారు. అక్టోబరు 26న మధ్యాహ్నం 3 గంటలకు పూతలపట్టు మండలం కిచ్చన్నగారిపల్లెకు చెందిన మల్లిక (50) మెడలోని 56 గ్రాముల చైన్ తీసుకెళ్లిపోయారు. అదే రోజు, అదే మండలం తలపులపల్లె వద్ద వైఎస్ గేటుకు చెందిన ప్రమీల (55) మెడలో మధ్యాహ్నం 3.08 గంటలకు చైన్ లాక్కెళ్లే ప్రయత్నం చేయగా.. ఆమె పోరాడి గాయపడింది. చికిత్స పొందుతూ మరణించింది. ఇక ఐరాల స్టేషన్ పరిధిలో అదే రోజు మధ్యాహ్నం 3.15 గంటలకు మరో దొంగతనం జరిగింది. జి.గొల్లపల్లెకు చెందిన నాగరత్నమ్మ (45) చిత్తూరు-పీలేరు మార్గంలోని గొల్లపల్లె బస్టాప్‌లో నిలబడి ఉండగా.. ఇద్దరు బైకులో వచ్చి ఆమె మెడలోని 36 గ్రాముల గొలుసును లాక్కెళ్లారు.

● ముఠాతో పోరాడి మరణించిన ప్రమీల

ఐరాల మండలం వైఎస్ గేటుకు చెందిన ప్రమీల (55) అక్టోబరు 26న స్కూటీలో పూతలపట్టుకు బయల్దేరింది. చిత్తూరు- పీలేరు హైవేపై తలపులపల్లె వద్ద వస్తుండగా.. ఎదురుగా కేటీఎం బైకులో వస్తున్న ఇద్దరు యువకులు ఆమెను అడ్రస్ కోసమంటూ నిలిపారు. అనుమానం వచ్చిన ప్రమీల మెడలోని చైన్‌ను గట్టిగా పట్టుకుంది. అయినా ఆ దుండగులు ఆమె మెడను గట్టిగా పట్టుకుని లాక్కెళ్లారు. చైన్‌ను మాత్రం తీసుకెళ్లలేకపోయారు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆ మహిళ రాణిపేట సీఎంసీలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ శుక్రవారం మరణించింది.

● చౌడేపల్లెలో 75 ఏళ్ల వృద్ధురాలి మెడలో..

మండల కేంద్రమైన చౌడేపల్లెలోని బైసాని పంక్షన్ హాల్ పక్కన నివాసం ఉంటున్న కె.రాజమ్మ (75) శనివారం మధ్యాహ్నం ఇంటి బయట నిల్చొని ఉన్నారు. ఇంటి పక్కనే ఉన్న కిరాణాషాపులో సిగరెట్ కోసం స్కూటర్ ఆపిన ఇద్దరు యువకులు దుకాణం పక్కనున్న రాజమ్మ మెడలో 42 గ్రాముల బంగారు గొలుసు లాక్కుని కందూరు వైపు వెళ్లిపోయారు. ఆమె గట్టిగా అరిచేసరికి కుటుంబ సభ్యులు మూడు స్కూటర్లలో దొంగల్ని వెంబడించారు. పోలీసులు కూడా స్పందించి ఫాలో అయ్యారు కానీ ముఠాను పట్టుకోలేకపోయారు.



● పోలీసుల వైఫల్యం..

జిల్లా పోలీసుల వైఫల్యంతో మహిళలు బయట తిరగాలంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. అక్టోబరు 26న జరిగిన మూడు దొంగతనాల విషయంలో ముఠాను వారం దాటినా పట్టుకోలేకపోయారు. ఆ ముఠాను పట్టుకోలేకపోవడంతో తాజాగా పుంగనూరు ప్రాంతంలో మరో మూడు దొంగతనాలు జరిగాయి. సీఎం చంద్రబాబు ఆదేశాలతో రౌడీ షీటర్లపై, అనుమానితులపై నిఘా ఉంచేందుకు 'ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్'ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. జిల్లా పోలీసులూ 790 మంది రౌడీషీటర్లను, 1600 మంది అనుమానితుల్ని గుర్తించారు. అయినా ఈ దొంగతనాల్ని నిలువరించలేకపోయారు.

● పుంగనూరులో రెండు ఘటనలు

శుక్రవారం రాత్రి పుంగనూరు మినీ బైపాస్ రోడ్డులో స్వగ్రామమైన రామసముద్రం వెళ్లేందుకు నాగజ్యోతి భర్త పిల్లలతో బస్సు కోసం వేచి ఉన్నారు. బస్సు వచ్చాక ఎక్కే సమయంలో ఆమె మెడలోని 15 గ్రాముల చైన్‌ను హెల్మెట్ వేసుకున్న ఇద్దరు యువకులు లాక్కెళ్లారు. అలాగే శనివారం రాత్రి మేలుపట్ల వద్ద కమల అనే మహిళ కుమార్తెతో కలిసి గుడి నుంచి ఇంటికి వెళ్తుండగా.. బైకులో వచ్చిన ముఠా ఆమె మెడలో 30 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లారు. శుక్ర, శనివారాల్లో జరిగిన ఈ ఘటనలు రెండూ రాత్రి 7 గంటలకే జరిగాయి.

● రెండు ముఠాలా..? ఒకటేనా..?

ఆశ్చర్యం కలిగించే విషయం ఏంటంటే.. అక్టోబరు 26న చిత్తూరు- పీలేరు హైవే మీద 15 నిమిషాల్లో ఓ ముఠా మూడు దొంగతనాలు చేయగా.. శుక్ర, శనివారాల్లో పుంగనూరు, చౌడేపల్లెలో మరో ముఠా మూడు దొంగతనాలకు పాల్పడింది. 26వ తేదీన కేటీఎం బైకులో ఇద్దరు యువకులు దొంగతనాలు చేయగా.. తాజాగా పుంగనూరు, చౌడేపల్లెలో జరిగిన మూడు దొంగతనాల్లోనూ ఇద్దరు యువకులే ఎఫ్‌జెడ్ బైకులో వచ్చారు. అక్కడ కేటీఎం.. ఇక్కడ ఎఫ్‌జెడ్.. అంతే తేడా. దొంగతనం జరిగిన తీరు. పాల్గొన్న దొంగల సంఖ్య ఒకటే. దీంతో ఈ ఆరు దొంగతనాల్లో పాల్గొంది రెండు ముఠాలా..? ఒకటేనా..? అని కోణంలో కూడా విచారణ జరగాల్సి ఉంది.

ద్రావిడ వర్శిటీలో విచారణ కమిటీ

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామక తీరుపై సమాచార సేకరణ



గుడుపల్లె, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకంపై శనివారం కమిటీ విచారణ చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కొన్ని నెలలుగా జీతాలు అందకపోవడంతో వారు నిరసన వ్యక్తం చేశారు. జీతాలు ఇస్తామని చెప్పిన వైసీపీ నాయకులు జీతాలు ఇప్పించలేకపోయారు. దీంతో ఉద్యోగులు రోజూ పరిపాలనా భవనం ఎదుట నిరసన కొనసాగించారు. ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తమ ప్రభుత్వం ఏర్పడిన తరువాత జీతాలు అందజేస్తామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ జీతాలను మంజూరు చేశారు. అయితే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకంపై వాస్తవ పరిస్థితులు తెలుసుకొనేందుకు చైర్మన్‌గా వీసీ ఆచార్య దొరస్వామి, సభ్యులుగా ఉర్దూ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య షావల్లీ ఖాన్, ఎస్వీయూ మాజీ డిప్యూటీ రిజిస్ట్రార్ వరదరాజులను విచారణ కమిటీగా రాష్ట్రప్రభుత్వం నియమించింది. శనివారం కమిటీ సభ్యులు ద్రావిడ విశ్వవిద్యాలయానికి చేరుకుని వీసీ దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్‌లతో సమావేశమయ్యారు. అనంతరం కమిటీ హాలుకు చేరుకొని అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకంపై అధికారుల ద్వారా ఫైళ్లు తెప్పించుకొని పరిశీలించారు. రాత్రి వరకు కమిటీ సభ్యులు వారికి కావలసిన సమాచారాన్ని సేకరించారు. కమిటీ రూపొందించిన నివేదికను ప్రభుత్వానికి అందించనుందని రిజిస్ట్రార్ తెలిపారు.

గుంతల్లేని రోడ్లే ధ్యేయం

- జిల్లాలో రూ.6.72కోట్లతో 482కి.మీ బీటీ రోడ్లకు మరమ్మతు పనులు
- కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదాలను అరికట్టడంలో భాగంగా జిల్లాలోని రహదారులను గుంతల రహితం చేయడమే ధ్యేయంగా ముందుకెళుతున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శనివారం చిత్తూరు నగరంలోని ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద స్టేట్‌హైవే బీటీ రోడ్డుపై ఉన్న గుంతలను మరమ్మతు చేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మేయర్ అముదతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆర్అండ్‌బీ పరిధిలో రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులోభాగంగా రూ. 6.72 కోట్లతో 482 కిలోమీటర్ల బీటీ రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. చిత్తూరు నియోజకవర్గానికి సంబంధించి రూ. 19 లక్షలతో 12.5 కిమీ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడానికి సీఎం చంద్రబాబు ఈ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. మాజీ మేయర్ కఠారి హేమలత, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసులు, డీఈ నాగమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


కంకర, తారు వేసి రోడ్డుపై గుంతలు పూడ్చే పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు


జీతాలు, పెన్షన్లు పడ్డాయి

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చెప్పినట్లే జీతాలు, పెన్షన్లు ఠంచనుగా ఖాతాల్లో వేసి ఇచ్చిన హామీని అమలు చేసింది. గత ప్రభుత్వ హయాంలో ప్రతినెలా 15వ తేది తరువాతే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్లు పడేవి. కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ 1, 2 తేదీల్లో గత నాలుగు నెలలుగా జీతాలు, పెన్షన్లు వేస్తోంది. శుక్రవారం రాత్రి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు సీఎఫ్ఎంఎస్ ద్వారా అక్టోబరు నెల జీతాలు, శనివారం ఉదయం నుంచి ప్రభుత్వ పెన్షనర్లకు పెన్షన్ మొత్తాలను వారి వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయడం ప్రారంభించింది. దాంతో ఉద్యోగ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

ఆదివారం ప్రత్యేకం

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి అలంకార ప్రియుడే కాదు, మంచి భోజన ప్రియుడు కూడా. ఈ తరం మాటల్లో చెప్పాలంటే మంచి ఫుడీ. కాకపోతే పిజ్జాలు, బర్గర్ల రకం కాదు. ఆరోగ్యకరమైన ఆహారం మాత్రమే స్వామి స్వీకరిస్తాడు. పోషక విలువలు మెండుగా ఉన్న ఆహారమే స్వామి నైవేద్యం. మనలాగే స్వామి కూడా రోజుకు మూడు పూటలు విభిన్నమైన ఆహారపదార్థాలు తీసుకుంటాడు. ఎప్పుడు పడితే అప్పుడు, ఏదిపడితే అది స్వామి స్వీకరించడు. ప్రాతఃకాలంలో, మధ్యాహ్న, రాత్రి సమయాల్లో స్వామికి నైవేద్యం సమర్పిస్తారు. ఆ నైవేద్యాల విశేషాలు.. ఈ ఆదివారం ప్రత్యేకం!

భోజన ప్రియుడు



ప్రత్యేక కథనం

ఆంధ్రజ్యోతి, తిరుమల

తిరుమల ప్రసాదం అనగానే లడ్డూ మాత్రమే గుర్తుకు వస్తుంది. నిజానికి 50 రకాల ప్రసాదాలను వెంకన్న స్వామికి నివేదిస్తారు. రోజూ సమర్పించేవి కొన్ని అయితే, వారానికో రోజు పెట్టేవి కొన్ని ఉంటాయి. ప్రత్యేక ఉత్సవాల రోజుల్లో సమర్పించే నైవేద్యాలు మరికొన్ని. మూలమూర్తికి సమర్పించేవి కొన్ని అయితే, మలయప్పస్వామికి నివేదించేవి మరికొన్ని ఉంటాయి. ప్రసాదాలను శ్రీవారి ఆలయంలోని పోటులోనే తయారు చేస్తారు. పోటులో ఈ వంటకాలను శ్రీనివాసుడి మాతృమూర్తి వకుళాదేవి పర్యవేక్షిస్తారని నమ్ముతారు. వీటిల్లో చాలా పరిమితమైన నైవేద్యాలు మాత్రమే భక్తులకు అందుతాయి. విక్రయించరు కాబట్టి వీటి గురించి చాలా మందికి తెలియదు.

సుప్రభాత సమయం: నవనీతం, గోక్షీరంతో తయారు చేసిన పదార్థాలను స్వామికి నివేదిస్తారు.

తోమాలసేవ తరువాత కొలువు ప్రసాదం: నల్ల నువ్వులు, బెల్లంతో చేసిన ఈ ప్రసాదాన్ని 'కొలువు పిండి ప్రసాదం' అంటారు. 'నువ్వుల చిమ్మిరి' అన్నమాట.

మొదటి గంట

ఉదయం 5.30 గంటలకు మీగడ, వెన్న, పెరుగుతో చేసే 'మాతృ దద్యోధనం' స్వామికి సమర్పిస్తారు.మాత్రన్నం (వెన్న, ఇంగువ, ఉప్పుతో చేసిన ప్రసాదం), శుద్దన్నం, చక్కెర పొంగలి, ఉప్పుపొంగలి, పులిహోర, కదంబం, దద్యోధనం కూడా స్వామికి నివేదిస్తారు.

రెండవ గంట

పొద్దు బాగా పైకొచ్చిన తర్వాత 10 గంటలకు నాదూకం, లడ్డూ, దోశ, వడ, అప్పం నివేదిస్తారు. సేకరాబాత్ పెడతారు.

అష్టోత్తరశత నామార్చన: ఉదయం 9.45 గంటలకు శుద్ధన్నం, సీరా నివేదిస్తారు.

రాత్రి గంట

7.30 తర్వాత మరీచాన్నం(మలహోర), ఉడాన్నం (బెల్లం పొంగలి), కదంబం, శుద్దన్నం, దద్యోధనం, పులిహోర, అమ్మవారి పాయసం(పలచగా వుండే చక్కెర పొంగలి), తోమాల దోసె, సీరాలను నివేదిస్తారు

రాత్రి విశ్రాంతి సమయంలో: పాయసాన్నం నివేదిస్తారు. పడుకోబోయే ముందు.. డ్రై ఫ్రూట్స్, పాలు, పండ్లు నివేదిస్తారు.



రోజూ పెట్టే ప్రసాదాలు చిత్రాన్నం, దద్యోధనం, క్షీరాన్నం, కదంబం, పాయసాన్నం.

వార నివేదనలు • **ఆదివారం నాడు** బియ్యపు పిండి, బెల్లం, నెయ్యితో ప్రత్యేకంగా తయారు చేసే అమృత కలశం ప్రసాదంగా పెడతారు. పానకం సమర్పిస్తారు. • **మంగళవారం** అష్టదళం తర్వాత సీరా, వడపప్పు, పానకం సమర్పిస్తారు. • **గురువారం** తిరుప్పావడలో పులిహోర, పిట్టు, జిలేబి, మురుకులను నైవేద్యంగా పెడతారు. రెండు గంగాళాల పాయసాన్ని కూడా నివేదిస్తారు. పానకం సమర్పిస్తారు. • **శుక్రవారం** అభిషేకం తర్వాత బెల్లం పాయసం, పోలీలు, పానకం నివేదిస్తారు.

మాత్రాన్నం

రోజూ మొదటిగంటకు రెండు గంగాళాల మాత్రాన్నం నైవేద్యంగా సమర్పిస్తారు.

మలహోర: రోజూ రాత్రి గంటకు రెండు గంగాళాల మలహోరను నివేదిస్తారు.





తోమాలదోశ: రాత్రి నైవేద్యంగా ప్రతి రోజు 51 దోశలను సమర్పిస్తారు.



మేవా: ఏటా మూడురోజుల పాటు జరిగే వసంతోత్సవాల సందర్భంగా వివిధ రకాల పండ్ల రసాలతో ఈ ప్రసాదాన్ని తయారు చేసి సమర్పిస్తారు.

గరుడసేవ ప్రత్యేకం మనోహరం: గరుడసేవ రోజు పెద్ద మనోహరం, రథోత్సవం రోజున చిన్న మనోహరం ప్రసాదంగా స్వామికి పెడతారు.

వరలక్ష్మీవ్రతం రోజున: శనగపిండితో చేసిన సుగీలను తయారు చేసి స్వామికి నివేదిస్తారు. పెసరపప్పుతో చేసిన సుగీలను జీయంగార్ల మఠానికి పంపుతారు.

గుగ్గిళ్లు: రోహిణి నక్షత్రం రోజున, ఏకాదశి, వైకుంఠ ఏకాదశి పర్వదినాల్లో పప్పు శనగ గుగ్గిళ్ల స్వామికి నైవేద్యంగా పెడతారు. ధనుర్మాసంలోనూ రోజూ మొదటి గంటలో గుగ్గిళ్ల నివేదిస్తారు.





సేకరాబాత్ : ప్రసాదాన్ని రెండవ గంటలో ఓ గంగాళాన్ని నివేదిస్తారు.



పోలీ: శుక్రవారం ఉదయం తొలి గంటకు 102 పోలీలను సమర్పిస్తారు.



బెల్లం పొంగలి: గురువారం మినహా రోజూ నాలుగు గంగాళాలు సమర్పిస్తారు.

పులిహోర: రోజూ నాలుగు గంగాళాలు. గురువారం మాత్రం తిరుప్పావడ సందర్భంగా అదనంగా 450 కేజీలు తయారు చేసి సమర్పిస్తారు.



దధ్యోదనం: రోజూ ఎనిమిది గంగాళాలు చేస్తారు. గురువారం మాత్రం మూడు గంగాళాలు నివేదిస్తారు.





జిలేబి: గురువారం రోజున జరిగే తిరుప్పావడ సేవ సందర్భంగా జిలేబీ, మురుకులను తయారు చేస్తారు. ఏడు పడులు అంటే దాదాపు 350 జిలేబీలను తయారుచేసి స్వామికి నివేదిస్తారు.

అమృతకలశం: ఆదివారం మాత్రమే ఈ ప్రసాదాన్ని ప్రత్యేకంగా ఒక గంగాళానికి తయారుచేసి సమర్పిస్తారు.



గర్భాలయంలోకి వెళ్లే ప్రసాదాలు: లడ్డూ, వడ, సుద్దాన్నం, మాతృ ప్రసాదం.

రోజూ క్యూలైన్లలో దర్శనానికి వచ్చే భక్తులకు పులిహోర 60 గంగాళాలు, పొంగలి 60 గంగాళాలు అదనంగా తయారు చేసి వితరణ చేస్తారు.

కదంబం: శని, ఆదివారాల్లో 16, మిగిలిన రోజుల్లో ఎనిమిది గంగాళాలు సమర్పిస్తారు.

మిరియాల పొంగలి: ప్రతిరోజు నాలుగు గంగాళాలు సమర్పిస్తారు.






స్వామికి సద్దెన్నం: మాతృప్రసాదం అంటే మనం తినే సద్దెన్నం వంటిదే. స్వామివారు భూలోకానికి వచ్చినపుడు వకుళమాత ఈ ప్రసాదం పెట్టేదట. రాత్రి మిగిలిన అన్నంలో పాలు, చేమిరి వేసి పెట్టి.. ఉదయాన్నే కుమారుడికి పెట్టేదంట. అందుకే దీనికి మాతృప్రసాదం అని పేరు వచ్చిందంటారు.







హత్యకేసులో నిందితుల అరెస్టు

చిల్లకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివేడు అరుంధతివాడ వెంకటేష్ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రమణకుమార్ తెలిపారు. శనివారం చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. కడివేడు అరుంధతివాడకు చెందిన వెంకటేష్, పొట్టేళ్ల సుబ్రహ్మణ్యం మధ్య పాత గొడవ లున్నాయి. ఇటీవల స్వల్ప వివాదం రాగా సుబ్రహ్మణ్యంతో పాటు అతని స్నేహితులైన సాయికుమార్, సునీల్‌ను వెంకటేష్ బెదిరించాడు. దీంతో వెంకటేష్‌ను చంపాలని వారు పథకం పన్నారు. అక్టోబర్ 31వ తేదీన వెంకటేష్ మరో ఇద్దరితో కలిసి గ్రామానికి చెందిన భాస్కర్ ఇంట్లో మద్యం తాగుతున్నాడు. ఈ క్రమంలో సునీల్ వెంకటేష్ కళ్లలో కారం పొడి చల్లగా సుబ్రహ్మణ్యం, సాయికుమార్ ఐరన్ రాడ్డు, సుత్తితో దాడి చేశారు. వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేష్ తండ్రి గోపాలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కోట క్రాస్ రోడ్డు సమీపంలో సుబ్రహ్మణ్యం, సాయికుమార్, సునీల్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో సీఐ కిషోర్‌బాబు, ఎస్‌ఐ సురేష్‌బాబు, సిబ్బంది రాజు, విష్ణు, భాస్కర్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమణకుమార్



మాట్లాడుతున్న సీఐ హుస్సేన్‌బాషా

తండ్రి హత్య కేసులో తనయుడి అరెస్టు

వాకాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగరాజపట్నం పంచాయతీ శ్రీనివాసపురం గిరిజన కాలనీలో తండ్రిని చంపిన కేసులో నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. గతనెల 31వ తేదీన తుపాకుల రమేష్ తన తండ్రి చిన్నరామయ్యను హత్యచేసిన విషయం విదితమే. మద్యం మత్తులో తలపై కర్రతో కొట్టడంతో చిన్నరామయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పరారైన రమేష్‌ను శనివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ హుస్సేన్‌బాషా తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ నాగబాబు పాల్గొన్నారు.

సముద్ర ముఖద్వారాల పరిశీలన

వాకాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిరాయదొరువు, కొండూరుపాళెం సముద్ర ముఖద్వారాలను శనివారం మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు ప్రత్యేక అధికారులతో కలసి పరిశీలించారు. శంకర్ మాట్లాడుతూ రూ.97కోట్లతో పూడిరాయదొరువు వద్ద పులికాట్ సరస్సులోని ముఖద్వారాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. తూపిలిపాళెం, కొండూరుపాళెం వద్ద ఉన్న ముఖద్వారాలను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. తీర ప్రాంతాల్లోని గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, మత్స్యకారుల జీవన ప్రమాణాల మెరుగునకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవోలు రఘుబాబు, రెడ్యానాయక్, డీఎఫ్‌పీ తదితరులు పాల్గొన్నారు.



పూడిరాయిదొరువు వద్ద సముద్ర ముఖద్వారాలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్

5న పెద్దశేష వాహనం

తిరుమల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5వ తేదీన నాగులచవితి సందర్భంగా తిరుమలలో పెద్దశేష వాహనంపై మలయప్పస్వామి దర్శనమివ్వనున్నారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ఉభయ దేవేరులతో కలిసి నాలుగు మాడవీధుల్లో ఊరేగనున్నారు. సర్పరాజైన ఆదిశేషువు జగన్నాథునికి నివాస భూమిగా, తల్పంగా, సింహాసనంగా సేవలందించినట్లు పురాణాలు చెబుతున్నాయి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.38 కోట్లు

తిరుమల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.38 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 67,785 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 27,723 మంది తలనీలాలు సమర్పించారు.

కార్తీకమాస మహోత్సవాలు ప్రారంభం

తిరుపతి అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన గణపతి హోమంతో కార్తీకమాస మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో నెల రోజులు ప్రత్యేక హోమాది క్రతవులు నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం విశేషంగా స్నపన తిరుమంజనం నిర్వహించి, అలంకరణ చేపట్టారు.



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. 32వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,792మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,058మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,612మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,141, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 304మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 240మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 55మంది భక్తులు పూజలు చేయించారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,682 అమ్ముడైనట్లు తెలిపారు.

ఆటోడ్రైవర్ దారుణ హత్య

• **స్నేహితుడే కాలయముడైన వైనం**

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్నేహితుడే కాలయముడై ఆటోడ్రైవర్ నాగరాజు(28)ను దారుణంగా హతమార్చాడు. ఈ ఘటన తొట్టంబేడు మండలంలోని శివనాథపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. తొట్టంబేడు ఎస్‌ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. శ్రీకాళహస్తి పట్టణం బీపీ అగ్రహారానికి చెందిన నాగరాజు ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శ్రీకాళహస్తి పట్టణం బహదూరుపేటకు చెందిన పద్మావతి గంగను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరు శివనాథపురం పంచాయతీ పరిధిలో అద్దె ఇంట్లో కాపురం పెట్టారు. తిరుపతికి చెందిన రాజేష్ అదే ప్రాంతంలో నివాసం ఉంటూ ఆటో నడుపుకునేవాడు. ఇద్దరు కలిసి మద్యం తాగుతూ తరచూ సెంట్రింగ్ పనులకు కూడా వెళ్లేవారు. రాజేష్ నాగరాజు కుటుంబంతో సన్నిహితంగా ఉండేవాడు. ఈ కారణంగా కొన్ని రోజులుగా నాగరాజు దంపతుల మధ్య విభేదాలు తలెత్తాయి. శుక్రవారం రాత్రి ఇద్దరు గొడవపడ్డారు. సర్ది చెప్పేందుకు రాజేష్ అక్కడికి వెళ్లాడు. ఇంతలో నాగరాజు రాజేష్ పట్ల దురుసుగా ప్రవర్తించాడు. ఆగ్రహానికి గురైన రాజేష్ బండరాయితో నాగరాజు తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పద్మావతి గంగ తొట్టంబేడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పరారీలో ఉన్న రాజేష్ కోసం గాలింపు చేపట్టారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు సాగిస్తున్నారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నాగరాజు మృతదేహం



కళ్లు 'తెర'వండి

కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలోని గంగినేని చెరువు పార్కులో ఎల్‌ఈడీ తెరను ఏర్పాటు చేశారు. గాలితో కాలుష్యం ఎంత మేరకు ఉందో దీనిపై ప్రదర్శించాల్సి ఉంది. గాలిలో తేమ, విష వాయువుల శాతం, శబ్ద తీవ్రతను తెలుసుకుని అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ తెర చాలా రోజులుగా పనిచేయకపోవడంతో నగరంలో కాలుష్యం ఎంత ఉందో ప్రజలకు తెలియడం లేదు. అధికారులు తక్షణం బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

- చిత్తూరు కలెక్టరేట్,ఆంధ్రజ్యోతి

గజదాడులు నిరోధిస్తాం

కౌండిన్య అభయారణ్యం పరిధిలో ఏనుగుల దాడుల నిరోధానికి అటవీశాఖ చర్యలు తీసుకుంటుందని అనంతపురం అటవీ రేంజ్ సీసీఎఫ్ యశోదాబాయి తెలిపారు. శనివారం ఆమె రామకుప్పం మండలం ననియాలలోని ఎలిఫెంట్‌క్యాంపు, ఎకో టూరిజం పార్కును, జంగిల్ సఫారీ పనులను, శిక్షణ పొందిన ఏనుగు(కుంకీ)లను పరిశీలించారు. కడ ఆధ్వర్యంలో చేపడుతున్న టూరిజం పనులను కూడా ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ అధికారులు, సిబ్బంది, ట్రాకర్స్ ఎప్పటికప్పుడు అడవిలో ఏనుగుల కదలికలను పసిగట్టాలన్నారు. అవి పొలాలు, జనావాసాల వైపు వచ్చే పరిస్థితులుంటే వాటిని అడవిలోకి మళ్ళించాలన్నారు. డీఎఫ్ఓ భరణీ, సబ్ డీఎఫ్ఓ వేణుగోపాల్, కుప్పం ఎఫ్ఆర్వో జయశంకర్ పాల్గొన్నారు.

- రామకుప్పం, ఆంధ్రజ్యోతి





శ్రమదానం

పెనుమూరు నుంచి చిత్తూరు వెళ్లే మార్గంలో పెద్దరాజుపల్లి గ్రామం వద్ద రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడి తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. కనీసం గుంతలకు మట్టి తోలి మరమ్మతులు చేయించాలని పలువురు కోరినా ఫలితం లేకపోయింది.దీంతో పెద్దరాజుపల్లి యువకులు శనివారం రోడ్డుపై ఉన్న గుంతల్లో మట్టి, ఇటుకలు చల్లి గుంతలను పూడ్చారు.

- పెనుమూరు, ఆంధ్రజ్యోతి

పుంగనూరులో మళ్లీ చైన్ స్నాచింగ్

మహిళ మెడలోని బంగారు చైన్‌ను లాక్కెళ్లిన దుండగుడు

పుంగనూరు రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పుంగనూరులో శనివారం రాత్రి మళ్లీ మహిళ మెడలో బంగారు చైన్‌ను ఓ అగంతకుడు లాక్కెళ్లాడు. పుంగనూరు పట్టణం దండుపాళ్యం రోడ్డులో కాపురమున్న పురుషోత్తంరాజు భార్య కమల(40), కుమార్తెతో కలిసి స్థానిక కళ్యాణ వెంకటరమణస్వామి ఆలయానికి వెళ్లి తిరిగి ఇంటికి బయల్దేరారు. మినీ బైపాస్ రోడ్డు దోబీ కాలనీ సమీపంలో వెళుతుండగా మోటారు సైకిల్‌లో హెల్మెట్ ధరించిన గుర్తుతెలియని వ్యక్తి కమల మెడలోని 30 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. బాధితురాలు గట్టిగా కేకలు పెట్టడంతో దుండగుడు బైపాస్‌రోడ్డులో పారిపోగా స్థానికులు గాలించినా ఫలితం లేకపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు చెప్పారు. అలాగే శుక్రవారం రాత్రి రామసముద్రం మండలం మినికి గ్రామానికి చెందిన నాగజ్యోతి కర్ణాటక రాష్ట్రం ముళబాగిల్‌లో బంధువుల ఇంటికి వెళ్లి పుంగనూరుకు వచ్చి స్వగ్రామానికి కుటుంబంతో వెళుతుండగా గుర్తుతెలియని ఇద్దరు హెల్మెట్లు ధరించి ఆమె మెడలోని 15గ్రాముల బంగారు చైన్ లాక్కెళ్లిన ఘటన మరచిపోకనే శనివారం సాయంత్రం చౌడేపల్లె బైపాని ఫంక్షన్‌హాల్ సమీపంలోని ఇంటిముందు ఉన్న రాజమ్మ మెడలోని బంగారు చైన్‌ను హెల్మెట్ ధరించిన ఇద్దరు ద్విచక్రవాహనంలో వచ్చి లాక్కెళ్లారు. ఇలా పుంగనూరు ప్రాంతంలో వరుస చోరీలు జరుగుతుండటంతో ప్రజలు బయట తిరగడానికి భయపడుతున్నారు.పోలీసులు చైన్‌స్నాచర్స్‌ను పట్టుకుని మళ్లీ జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

హైవేపై దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు



హైవే దొంగలను చూపుతున్న సీఐ

ఐరాల(కాణిపాకం) నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాణిపాకం పోలీస్ స్టేషన్ పరిధిలోని బొమ్మసముద్రం హైవే వద్ద దొంగతనానికి పాల్పడిన ఇద్దరిని శనివారం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీధర్ నాయుడు తెలిపారు. సీఐ కథనం మేరకు... గత నెల 29వ తేదీ రాత్రి బొమ్మసముద్రం హైవేపై తిమ్మోజిపల్లెకు చెందిన వెంకటమునిి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా ఇద్దరు వ్యక్తులు అతడిపై దాడి చేసి, ద్విచక్ర వాహనాన్ని, సెల్ ఫోన్, కొంత నగదును తీసుకుని పారిపోయారు. ఈ విషయంపై బాధితుడు కాణిపాకం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ ధరణిదర తన సిబ్బందితో కలసి విచారణ ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం ఎం.పైపల్లె బస్ షెల్టర్ వద్ద సంచరిస్తున్న దొంగలను ఎస్ఐ తన సిబ్బందితో కలసి పట్టుకుని వారి వద్ద నుంచి సెల్ ఫోన్, ద్విచక్ర వాహనం, కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో చిత్తూరు జానకారపల్లెకు చెందిన సింగమల్లై, రజినిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. దొంగతనం కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన ఎస్ఐ ధరణిదరను, సిబ్బందిని సీఐ అభినందించారు.



పంటలపై గజదాడులు



గడ్డంవారిపల్లి, రాగిమానుపెంటలో వరి పంటను ధ్వంసం చేసిన ఏనుగులు

కల్లూరు/బంగారుపాళ్యం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. గడ్డంవారిపల్లి పంచాయతీలో శుక్రవారం రాత్రి వరి, కొబ్బరి, మామిడి పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేయడంతో అపారనష్టం వాటిల్లింది. పగడాలవారిపల్లిలో కృష్ణమూర్తికి చెందిన వరి పంటన, సదాశివకు చెందిన 5 మామిడిచెట్లు, రమణకు చెందిన వరిపంట, గడ్డంవారిపల్లిలోని కౌలు రైతు తీర్థకు చెందిన వరిపంట, గంగారపుఇండ్లలోని శంకర్‌కు చెందిన వరిపంట, పాపిరెడ్డిగారిపల్లిలో గురవయ్యకు చెందిన 4 కొబ్బరిచెట్లు, జొన్నపంటను ఏనుగులు ధ్వంసం చేశాయి. ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను ఎఫ్ఎస్ఓ మహమ్మద్ షఫి పరిశీలించారు.

రాత్రి సమయాల్లో బావుల వద్ద ఉండొద్దు

బంగారుపాళ్యం మండలంలోని రాగిమానుపెంట రెవెన్యూ రాళ్లవంక అటవీ ప్రాంతంలో శుక్రవారం రాత్రి మూడు ఏనుగులు దాడి చేసి వరి పంటను ధ్వంసం చేశాయి. రాగిమానుపెంటకు చెందిన సూరెమ్మ చేతికి అందివచ్చిన వరి పంటను తొక్కి నాశనం చేశాయి. ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు. ఎఫ్ఎస్‌వో మోహన్ మురళీ మాట్లాడుతూ నష్టపోయిన వరి పంటను పరిశీలించి పైఅధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. రాగిమానుపెంట అటవీ ప్రాంతంలో 15 ఏనుగులు తిష్ట వేశాయని, ఇవి రాత్రి వేళల్లో పంట పొలాలపై దాడి చేయకుండా ఉండేందుకు ట్రాకర్స్, అటవీ అధికారులు గస్తీ కాస్తున్నామని తెలిపారు. బావుల వద్ద రైతులు రాత్రి సమయాల్లో ఉండరాదని సూచించారు.

బాలకార్మిక వ్యవస్థను నియంత్రించేందుకు చర్యలు: జేసీ



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జేసీ విద్యాధరి ఆదేశించారు. శనివారం జేసీ ఛాంబర్‌లోని సమావేశ మందిరంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. జేసీ మాట్లాడుతూ బాలకార్మికులు ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని, హోటల్స్, ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేస్తుంటే వెంటనే గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో బాలకార్మికులను పాఠశాలల్లో చేర్పించి విద్యనందించాలని చెప్పారు. బాల్య వివాహాలు చాలా చోట్ల జరుగుతున్నాయని, దీంతో బాలికల మెటర్నల్ డెత్‌లు ఎక్కువగా జరుగుతున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ గుర్తించిందన్నారు. పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో సమగ్ర శిక్షా ఏపీసీ వెంకట్రమణారెడ్డి, డీఎంహెచ్‌వో ప్రభావతి, లేబర్ ఆఫీసర్ ఓంకార్, సంక్షేమశాఖ అధికారిణి రాజ్యలక్ష్మితో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గుర్తింపు కలిగిన పార్టీలకు ఓటరు జాబితాలు



తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఓటరు జాబితా బండిళ్లు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల విభాగం గత నెల 29న జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. జాబితాను ఓటర్లు పరిశీలించి ఆక్షేపణలు, అభ్యంతరాలుంటే సమీప ఎన్నికల అధికారికి అందించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. ఈ మేరకు గత నెల 29 నుంచి నవంబరు 28వరకు అభ్యంతరాలు, కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఇచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితాను నియోజకవర్గాల వారీగా ఒక్కో సెట్టును గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఉచితంగా అందించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. కలెక్టరేట్‌లో సిద్ధంగా ఉంచిన బండిళ్లను సోమవారం నుంచి పార్టీ కార్యాలయాలకు తరలిస్తారు. ఇప్పటికే కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలు, పోలీసు స్టేషన్లు, సచివాలయాల వద్ద ఓటర్లు తమ పేర్లను పరిశీలించుకునేందుకు ఓటరు జాబితాను సిద్ధంగా ఉంచారు. ఇదిలా ఉండగా ఈ నెల 9, 10, 23, 24 తేదీలలో ఇందుకోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు యువశ్రీ



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే


ఐరాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న క్రీడాకారిణి యువశ్రీ జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైంది. ఈ క్రీడాకారిణి ఈ నెల 17న జమ్మూలో నిర్వహించే జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు వెళ్లనుంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీమోహన్ క్రీడాకారిణిని అభినందిస్తూ ఆమెకు దారి ఖర్చులకు గాను ఆర్థిక సహాయాన్ని అందించారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపి మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గిరిధర్‌బాబు, హరిబాబు నాయుడు, మణి నాయుడు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రూటా జిల్లా అధ్యక్షుడిగా మునీర్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మునీర్ అహ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా మహమ్మదుల్లా, కోశాధికారిగా ఇలియాస్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని పలువురు ఉర్దూ టీచర్లు అభినందించారు.

పసిమొగ్గను చిదిమేసిన మానవ మృగం

గంటల వ్యవధిలో నిందితుడి అరెస్టు ● రూ.10లక్షల పరిహారం ప్రకటించిన ప్రభుత్వం



పుత్తూరుఅర్బన్/కేవీబీపురం/వడమాలపేట, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ముక్కు పచ్చలారని ఓ చిన్నారి బతుకును చిదిమేసిందో మానవమృగం. కన్నూమిన్నూ కానక ఓ కామాంధుడు లైంగికదాడికి పాల్పడి అమానుషంగా హత్య చేసిన వైనంతో జిల్లా ప్రజానీకం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. రెక్కాడితేగాని డొక్కాడని ఓ పేద కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపిన ఈ అమానవీయ ఘటనపై తీవ్ర ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. కేవీబీపురం మండలానికి చెందిన నిరుపేద దంపతులకు బాబు, పాప ఉన్నారు. పాపకు మూడేళ్లు. ఉన్నఊరిలో బతకడానికి సరైన దారిలేక ఈమధ్య భార్యపుట్టిన వడమాలపేట మండలానికివచ్చారు. అక్కడే కూలిపనులు చేసుకుంటూ బతుకుతున్నారు.

ఆనందం అంతలోనే ఆవిరి

శుక్రవారం పిల్లలతో దీపావళి పండుగ జరుపుకోవాలని ఆ దంపతులు ఎంతో ఆనందంగా ఉన్నారు. చిన్నారి తండ్రి తనకున్న ఆర్థిక స్తోమత మేరకు బాణసంచా తెచ్చాడు. తర్వాత పొరుగూరికి వెళ్లాడు. ఇంతలోనే చిన్నారి కనిపించడం లేదంటూ అతనికి భార్య తల్లి ఫోన్ చేసింది. బాగా వెతుకు.. భయపడవద్దంటూ ఫోన్‌లోనే ధైర్యం చెప్పాడు. వెంటనే ఇంటికి చేరుకున్నాడు. ఊరంతా బాలిక కోసం జల్లెడ పట్టారు. అయినా కనిపించకపోయే సరికి తీవ్ర ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చిన సుశాంత్ చిన్నారిని తీసుకెళ్లాడని గుర్తుకు తెచ్చుకున్నారు. అతడిని ఆరా తీసినా తనకేమీ తెలియదంటూ బుకాయించాడు. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. సుశాంత్‌ను విచారించేసరికి ఘాతుకం బయటపడింది.

ఈ మానవమృగం బంధువే

ఈ దంపతులకు దగ్గర బంధువైన యువకుడు సుశాంత్(22) ఇటీవల బెంగళూరు నుంచి కాలనీలో ఉంటున్న పెదనాన్న ఇంటికి వచ్చాడు. కొన్ని రోజులుగా పనులకు వెళ్లకుండా మద్యం తాగుతూ ఖాళీగా తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సుశాంత్ చాక్లెట్ ఆశ చూపించి చిన్నారిని తనతో తీసుకుపోయాడు. ఎవరూ లేని ప్రదేశంలో లైంగిక దాడికి పాల్పడి దారుణంగా హతమార్చి మురికికాల్వలో పూడ్చేశాడు. తమ గారాలపట్టి కనిపించకపోయే సరికి తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. కొన్ని గంటల తర్వాత తెలిసిన దుర్మార్గుడి ఘాతుకంతో నిశ్చేష్టులయ్యారు.



నిందితుడు సుశాంత్

ఊరంతా విషాద సంద్రం

నిందితుడు సుశాంత్‌ను అరెస్టు చేసి, చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. శనివారం పుత్తూరులో పోస్టుమార్టం అనంతరంమృతదేహాన్ని పోలీసు బందోబస్తుమధ్య ప్రత్యేకవాహనంలో స్వగ్రామానికిచేర్చారు. చిన్నారి మృతదేహాన్ని చూసి ఊరంతా కన్నీటిపర్యంతమయ్యారు. కాలనీ విషాదంలో మునిగిపోయింది. చిన్నారి తల్లి స్పృహతప్పి పడిపోయింది. వారిని ఓదార్చడం ఎవరివల్ల కాలేదు. గ్రామస్తులే చిన్నారికి అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో సీఐ భాస్కర్‌నాయక్, ప్రత్యేక పోలీసు దళం, కేవీబీపురం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే భానుప్రకాష్

చిన్నారిని హత్యాచారం ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని ఎమ్మెల్యే భానుప్రకాష్ తెలిపారు. బాధిత కుటుంబానికి పూర్తి అండగా ఉంటామని తెలిపారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులను పుత్తూరు, వడమాలపేట మండలాల నాయకులు గంజి మాధవయ్య, ధనంజయులునాయుడు, లోకరాజు, జీవరత్నం నాయుడు, కరుణాయాదవ్, షణ్ముగరెడ్డి, తదితరులు ఓదార్చారు. చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు రాజన్ రూ.20 వేలు, పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. సంఘటనను ఖండిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పుత్తూరు పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రి రోజాతో పాటు వైసీపీ నాయకులు నారాయణస్వామి, కరుణాకరరెడ్డి, మునివేలు, జయప్రకాష్, చిన్నా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



చిన్నారి హత్యను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

నేడు హోం మంత్రి రాక

నిందితుడిని కఠినంగా శిక్షించాలని పోలీస్ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. బాధిత బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు హోంమంత్రి వంగలపూడి అనిత ఆదివారం రానున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షలను ఆమె అందజేయనున్నారు. ఇది హేయనీయమైన చర్యగా అనిత అభివర్ణించారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పందిస్తూ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి కఠిన శిక్షపడేలా ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కేసును చాలా తీవ్రంగా పరిగణించినట్లు ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. ప్రభుత్వ స్పందన, సంఘటన తీవ్రతను గుర్తించిన జిల్లా అధికారులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రామ్మోహన్ తదితరులు చిన్నారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా సాయంగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. క్లూస్ టీం రంగంలోకి దిగి ఆధారాలను సేకరించారని ఎస్పీ చెప్పారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా, పీడీ ట్రైల్ చేసి కఠిన చర్యలు చేపడతామన్నారు. కాగా చిన్నారిని అమానుషంగా హత్యచేసిన నిందితుడిని తమకు అప్పగించాలంటూ గ్రామస్తులు, బంధువులు ఎస్పీ సుబ్బారాయుడు ఎదుట వాపోయారు. గ్రామానికి వచ్చిన ఎస్పీ వద్ద వారంతా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆదిలక్ష్మి, శ్రీనివాసులు, అకీలా

పుంగనూరు రూరల్ 2 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు-తిరుపతి మార్గంలోని గొల్లపల్లె సమీపంలో శనివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. చౌడేపల్లె మండలం ముద్దిరెడ్డిపల్లెకు చెందిన వెంకట్రమణ కుమారుడు శ్రీనివాసులు(18), అతడి తల్లి ఆదిలక్ష్మి(35), కుమారుడు హర్షవర్ధన్(4), కుమార్తె అకీలా(2)లు ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వస్తుండగా పుదిపట్లకు చెందిన బాబురెడ్డి ద్విచక్రవాహనంలో పుంగనూరు వైపు నుంచి పుదిపట్లకు వెళుతూ గొల్లపల్లె వద్ద ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు, ఆదిలక్ష్మి, హర్షవర్ధన్, అకీలాతోపాటు బాబురెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. బాబురెడ్డిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా మిగిలిన వారిని 108 వాహనంలో పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి


ప్రసంగిస్తున్న మధుసూదన రెడ్డి

కల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మామిడిపంట పరిరక్షణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన రెడ్డి తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మామిడి, టమోటా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మామిడిలో పూత రావడానికి ముందే మల్టీ కే 8 గ్రాములు, బోరాన్ 2 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే పూత బాగా వస్తుందన్నారు. మొక్క కాండం నుంచి చిగురు వరకు తడిచేసే విధంగా పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త బాలహాస్సేన్, ఉద్యానశాఖ అధికారిణి సంతోషికుమారి, ఏవో శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు అప్పినపల్లె విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెద్దపంజాణి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు అప్పినపల్లె ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం నందకుమార్, పీడీ ఉదయ్‌కుమార్ తెలిపారు. గతనెల బంగారుపాళ్యం మండలంలోని బీఆర్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన జిలాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో 10వ తరగతి చదువుతున్న గిరీష్‌కుమార్ అండర్-17 విభాగంలో, 9వతరగతి చదువుతున్న యుగంధర్ అండర్-14 విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు త్వరలో గుంటూరులో జరిగే పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థి పుస్తకాల వితరణ



కుప్పం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని డాక్టర్ వైసీ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2004-2007 విద్యా సంవత్సరంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో చదివిన విద్యార్థి ఎన్.స్వరూప్ తాను చదివిన కళాశాలకు రూ. లక్ష విలువ చేసే పుస్తకాలు వితరణ చేశారు. అకడమిక్, ఈసెట్, గేట్, సివిల్స్ పరీక్షలకు ఉపయోగపడే అన్నిరకాల పుస్తకాలు ఇందులో ఉన్నాయి. ఈ సందర్భంగా స్వరూప్ మాట్లాడుతూ ప్రస్తుతం తాను కాలిఫోర్నియాలో సిగ్నా గ్రూప్‌లో పైథాన్ డెవలపర్‌గా ఉన్నట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ ఎం.జగన్నాథరావు, ఎలక్ట్రికల్ విభాగాధిపతి సీహెచ్.సుబ్బన్న, కంప్యూటర్స్ లెక్చరర్ బాహూజీనాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పలమనేరు స్టేషన్‌కు వాస్తు మార్పు



పలమనేరు పోలీసుస్టేషన్‌కు పడమర వైపు పోలీసులు మూసివేసిన దారి

పలమనేరు, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి): పలమనేరు పోలీసుస్టేషన్‌కు వాస్తు సవరణలు నిరంతర ప్రక్రియగా మారిపోయింది. ఇక్కడికి వచ్చే అధికారులు గత కొన్నేళ్లుగా స్టేషన్ భవనానికి వాస్తు సవరణలు చేస్తున్నారు. తాజాగా ఇక్కడి పోలీసు స్టేషన్ ఉన్న పడమటి ద్వారాన్ని మూసి వేశారు. గతంలో పలమనేరు పోలీసుస్టేషన్ సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఉండేది. అయితే మూడు దశాబ్దాల క్రితం పోలీసు స్టేషన్‌కు నూతన భవనం నిర్మించారు. అప్పుడు ఈ పోలీసుస్టేషన్‌కు కాంపౌండు కూడా వుండేది కాదు. తరువాత దాతల సహకారంతో కాంపౌండు నిర్మించారు. అటుపిమ్మట అప్పట్లో ఉత్తరం వైపు పోలీసుస్టేషన్‌కు వెళ్లేందుకు కాంపౌండు గోడకు ప్రధాన ద్వారం వుండేది. అటుపిమ్మట కొన్నేళ్లకు ఈ ఉత్తరం వైపు ఉన్న ద్వారం ముందు వాహనాలు నిలిపివేస్తున్నారని ఓ అధికారి కాంపౌండుకు పడమర వైపు గేటు పెట్టించి అప్పటి వరకు ఉత్తరం వైపు ఉన్న గేటును తొలగించారు. అయితే ఆరేళ్లక్రితం ఈ దారి కూడా సరిగా లేదని ఈశాన్యంలో ఉన్న గోడను కొట్టివేయించి తాలూకా కచ్చేరి వీధికి కూడా మరో ద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఈ రెండు ద్వారాలు నాలుగైదు సంవత్సరాలుగా ఉన్నాయి. అయితే తాజాగా ప్రస్తుత అధికారులు కేవలం ఈశాన్యం వైపు ఉన్న ద్వారం వుంటేనే స్టేషన్‌కు వాస్తు బాగుంటుందని భావించడంతో పడమరవైపు ఉన్న గేటుకు అడ్డుగా డివైడర్లకు వినియోగించే బోర్డులు పెట్టారు. ఇప్పటికైనా పలమనేరు పోలీసు స్టేషన్‌కు వాస్తు కుదిరినట్టేనా అని స్థానికులు చర్చించుకొంటున్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన సీఎన్ఆర్ కళాశాల విద్యార్థులు

గుడిపాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీఎన్ఆర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల అధినేత లోకేష్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు మెసానికల్ గ్రౌండ్‌లో జరిగిన అండర్-19 ఖోఖో పోటీల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న హరికాంత్, ఝాన్సీరాణిలు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారన్నారు. తిరుపతిలోని మంగళం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జరిగిన అండర్-17 బేస్‌బాల్ పోటీల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి చెందిన జ్యోత్స్న గుంటూరులో జరుగబోవు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. అదేవిధంగా దేవి విద్యామందిర్ పాఠశాల విద్యార్థులు అండర్-14 బేస్‌బాల్ జిల్లాస్థాయి పోటీల్లో 9వ తరగతి చదువుతున్న గౌతమ్, మనోజ్, 6వ తరగతి చదువుతున్న లిల్లీధర్ గుంటూరులో జరుగబోవు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధ, అర్జున్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పెద్దపంజాణి, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపల్లెలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు టీడీపీ నాయకుడు భానుప్రతాప్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతికి చెందిన రమాదేవి హాస్పిటల్ వారిచే ఆదివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు.ఆర్థో, యూరాలజీ, న్యూరో, చెవి, ముక్కు, గొంతు, ఊపిరితిత్తులు, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు చికిత్సలు అందిస్తారన్నారు.

పెన్షన్ల పంపిణీలో పెద్దపంజాణికి రెండో స్థానం

పెద్దపంజాణి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పెన్షన్ల పంపిణీలో చిత్తూరు జిల్లాలోనే 2వ స్థానంలో పెద్దపంజాణి మండలం నిలిచిందని ఎంపీడీఓ బాలాజి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 8216 మందికి పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉండగా 8161 మందికి పంపిణీ చేశామన్నారు. వివిధ కారణాలతో 55 మంది అందుబాటులో లేకపోవడంతో పంపిణీ చేయలేదన్నారు.

షూటింగ్ బాల్ క్రీడాకారుల ఎంపిక రేపు

కుప్పం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఈనెల 4వ తేదీన జిల్లా సీనియర్ బాలుర షూటింగ్ బాల్ క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ ఛైర్మన్ ఎ.మహేశ్, కార్యదర్శి వేణుగోపాల్‌లు తెలిపారు. కర్నూలులో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు చిత్తూరు జిల్లా బాలుర జట్టును ఎంపిక చేస్తామన్నారు.

రాళ్ల గంగమ్మ ఆలయ హుండీ చోరీ

కుప్పం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కునత్తం పంచాయతీ ములకలపల్లెలో వెలసిన రాళ్ల గంగమ్మ ఆలయం హుండీని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం రాత్రి ఆలయం గేటు పగులగొట్టి, హుండీలోని కానుకలు, నగదు దోచుకున్నారు. శనివారం ఉదయమే గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు.

బాల కార్మికుల నిర్మూలనపై అవగాహన ర్యాలీ


సోమలలో బాలకార్మికుల నిర్మూలన ర్యాలీ

సోమల, నవంబరు 2: జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ ఆదేశాలతో శనివారం బాల కార్మిక నిర్మూలనపై ర్యాలీ జరిపారు. పలు హోటళ్లు, మెకానిక్ షాపులను తనిఖీ చేశారు. బాల కార్మిక నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీలేరు సహాయ కార్మిక అధికారి ఆనందబాబు. సీఆర్పీ సోమశేఖర్, ప్రసూన, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి తాళలేక ఓ బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం పెద్దపంజాణి మండలంలో చోటుచేసుకుంది. ఓబులాపురానికి చెందిన రాజకుమార్ కుమార్తె పల్లవి(12) కడుపు నొప్పి తాళలేక పురుగులమందు తాగింది. కుటుంబసభ్యులు గుర్తించి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా సహదేవయ్య


సహదేవయ్య, లోకనాథ్

చౌడేపల్లె, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) మండలాధ్యక్షుడిగా ఉపాధ్యాయుడు సహదేవయ్య ఎంపికైనట్లు రాష్ట్ర నాయకులు రఘుపతి రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ స్కూల్ ఏపీ ఐక్య ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శిగా లోకనాథ్‌రెడ్డి, కోశాధికారిగా రమేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జగన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో బొమ్మల పరిశ్రమ ఏర్పాటు చేయాలి

పుంగనూరు రూరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): పుంగనూరు టిడ్కో ఇళ్ల సమీపంలో బొమ్మల పరిశ్రమ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులకు లేఖ రాసినట్లు బీజేపీ రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు పి.అయూబ్ ఖాన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పుంగనూరు సమీపంలోని గూడూరుపల్లె టిడ్కోఇళ్ల వద్ద బొమ్మల పరిశ్రమల ఏర్పాటు చేయాలని కేంద్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ మంత్రి నితిన్ జైరామ్ గడ్కరీ, సహాయ మంత్రి ప్రతాప్ చంద్రసారంగి, కేంద్ర కమ్యూనికేషన్స్ ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్, లా అండ్ జస్టిస్ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, సహాయ మంత్రి సంజయ్‌ధోత్రేలకు లేఖలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు నరసింహులు, నాయకులు మఠం బాబు, ప్రసాద్, నాగరాజు, సాయిప్రకాశ్, కుమార్, సంతోష్, భాస్కర్, పవన్ పాల్గొన్నారు.

పగలూ వెలుగుతున్న వీధి లైట్లు



సోమల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలోని పలు వీధుల్లో వీధి దీపాలు పగలు రాత్రి తేడా లేకుండా నిత్యం వెలుగుతున్నాయి. పలుమార్లు ట్రాన్స్‌కో, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలు పగలు వెలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నీరు లేక బోసిపోయిన చెరువులు


పలమనేరు మండలంలోని సముద్రపల్లి, బేరుపల్లి, కూర్మాయి చెరువులు

పలమనేరు, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి): రెండు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షాలు కురిసి ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మరినా పలమనేరు నియోజకవర్గంలోని చెరువులకు నీరు చేరకపోవడంతో రైతులు బావురమంటున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో వేరుశనగ విత్తే సమయంలో నామమాత్రంగా వర్షం కురిసింది. అటుపిమ్మట ఆకాశం మేఘావృతం అవుతున్నా వర్షం మాత్రం అంతంత మాత్రమే. దీంతో నియోజకవర్గంలోని దాదాపు 450 చెరువులకు గాను 400 చెరువుల్లో చుక్కనీరు లేని పరిస్థితి నేటికి కొనసాగుతోంది. సాధారణంగా ఖరీఫ్ ప్రారంభంలో కురిసే వర్షాల కారణంగా చెరువులకు ఎంతో కొంతనీరు చేరేది. అటుపిమ్మట సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో కురిసే వర్షాలకు, తుఫాన్లకు చెరువులకు గణనీయంగా నీరు చేరేది. అయితే ఈ ఏడాది అందుకు భిన్నంగా చెరువులు బోసిపోయాయి. దీంతో చెరువు ఆయకట్టులో ఏం సాగు చేయాల్లో దిక్కుతోచక రైతులు సతమతమవుతున్నారు. అంతేకాక నియోజకవర్గంలో సంప్రదాయ పంటలకు స్వస్తిచెప్పిన రైతులు కూరగాయల సాగు చేస్తున్నారు. దీనికి తోడు పాడిఆవులను పోషిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇప్పటి వరకు పాడిఆవులకు పశుగ్రాసం కొరత లేనప్పటికి ఇలాగే వర్షాలు రాకుండా చెరువులకు నీరు చేరకపోతే పశుపోషణ కూడా భారమవుతుందని పాడిరైతులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాక రానున్న వేసవిలో తాగునీటికి కూడా ఇబ్బందులు తప్పవని గ్రామీణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అంతేకాక నియోజకవర్గం మీదుగా వేస్తున్న ఆరులైన హైవేకు సైతం బైరెడ్డిపల్లి, పలమనేరు, వి.కోట మండలాల్లోని పలు చెరువుల్లో వేలాది టిప్పర్ల మట్టిని రోడ్డు నిర్మాణానికి తరలించారు. దీంతో ఈ మట్టి తోడిన చెరువులు ఆనవాళ్లు కోల్పోయాయి. ఈ చెరువులకు నీరు చేరినా ఆయకట్టు కంటే దిగువ వైపున చెరువుల్లో నీరు వుండి అవి ఏమాత్రం వినియోగించుకొనేందుకు వీలు లేని పరిస్థితి. చెరువుల్లో మట్టి తోడేస్తున్నా రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురియకపోతే భూగర్భ జలాలు మరింత అడుక్కు పోయి రైతుల బోర్లు కూడా ఎండిపోతాయని రైతులు అంటున్నారు.

మాకు తెలియకుండా పనులెలా చేస్తారు?

- ఆర్‌అండ్‌బీ అధికారుల తీరుపై టీడీపీ మండల అధ్యక్షుడి ఆగ్రహం


కుప్పం మండలం వసనాడులో గుంతలు పూడ్చే పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం వసనాడు గొల్లపల్లె పరిధిలో రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం ప్రారంభోత్సవ సమయంలో వివాదం చోటు చేసుకుంది. 'స్థానిక నేతలకు, ప్రజలకు తెలియకుండా పనుల జాబితా ఎలా తయారు చేస్తారు?' అంటూ ఆర్‌అండ్‌బీ అధికారులపై కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలిలా.... రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమానికి కుప్పం నియోజకవర్గానికి రూ.1.28 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో మొత్తం 51 కిలోమీటర్ల మేర రోడ్లపై గుంతలు పూడ్చడానికి నిర్ణయించారు. అయితే ఏయే మండల పరిధిలో ఏయే రోడ్డు ఎక్కువగా గుంతలు పడి అధ్వానంగా ఉన్నదన్న విషయాన్ని గుర్తించడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు స్థానిక నేతలనే కాదు, ప్రజలను, పంచాయతీలను కూడా విశ్వాసంలోకి తీసుకోలేదు. శనివారం హడావుడిగా పనుల ప్రారంభోత్సవం ఏర్పాటు చేశారు. అనంతరం జరిగిన సభావేదికపై ఇదే విషయంపై కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆర్‌అండ్‌బీ అధికారులను నిలదీశారు. తమ మండలానికి కేవలం రూ.16 లక్షలు మాత్రమే కేటాయించి వివక్ష చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ పనులను గుర్తించడంలో కచ్చితంగా అధికారులు స్థానిక నేతలను విశ్వాసంలోకి తీసుకోవాల్సిందేనన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, అధికారులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌కు స్థలం కేటాయించాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సొసైటీ నాయకులు

పుంగనూరు, నవంబరు2(ఆంధ్రజ్యోతి): పుంగనూరులో చేపల మార్కెట్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని గత 14ఏళ్లుగా మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితంలేదని వెంకటేశ్వర ఫిషర్‌మ్యాన్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. చేపల మార్కెట్‌కు ప్రభుత్వం సరైన స్థలాన్ని కేటాయించాలని ఆయన కోరారు. శనివారం స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో మత్స్యసంఘ నాయకులు పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం 60 శాతం సబ్సిడీతో చేపపిల్లలు ఇవ్వడం హర్షనీయమన్నారు. మైదాన ప్రాంతంలో నివాసం ఉండే బెస్తలకు మత్స్య భరోసా కల్పించాలని కోరారు. సమావేశంలో ఐటీడీపీ నాయకుడు కుమార్, బీజేపీ నాయకుడు నానబాల కుమార్, బీసీ నాయకుడు గంపల గంగరాజు, కమిటీ సభ్యులు కామేశ్వరరావు, దొరస్వామి, రఘుబాబు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు


కొత్తూరులో టీడీపీ సభ్యత్వ నమోదులో నాయకులు

పుంగనూరు రూరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరడిగుంట పంచాయతీలో శనివారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీలో రూ. 100 చెల్లించి సభ్యత్వం పొందిన కార్యకర్తలకు పార్టీ రూ. 5లక్షలు బీమా సౌకర్యం కల్పిస్తోందన్నారు. అలాగే కార్యకర్త ప్రమాదవశాత్తు మృతి చెందితే అంత్యక్రియల ఖర్చు కింద రూ.10వేలు ఇస్తారన్నారు. టీడీపీ నాయకులు గంగాధర్, హరి, రాంబాబు, రమేశ్, రామకృష్ణ, మణి, వీరభద్రస్వామి పాల్గొన్నారు.

సోమల : మండలంలోని కందూరు, మిట్టపల్లెలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు సి.సుబ్రమణ్యం సభ్యత్వ నమోదుపై కార్యకర్తలకు సూచనలు చేశారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, శంకర్, శ్రీనివాసులు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో కార్తీక ఆకాశ దీపం



పుంగనూరు, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి): కార్తీకమాసం ప్రారంభం కావడంతో శనివారం సాయంత్రం పుంగనూరులోని ప్రసన్న పార్వతీదేవి సమేత సోమేశ్వరస్వామి ఆలయ ధ్వజ స్తంభంపై అర్చకులు ఆకాశదీపాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం నుంచి కార్తీకమాస ప్రవేశంతో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక భోగ నంజుండేశ్వరస్వామి ఆలయం, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, నెక్కొంది అగస్తీశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక పూజలు జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు శైవ క్షేత్రాలు సందర్శించి పూజలు చేశారు.

నేడు గజ స్తంభస్థాపన

అలాగే పుంగనూరు కోనేరు వద్ద వెలసిన అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం గజ స్తంభ స్థాపన కార్యక్రమం జరుగుతుందని అర్చకులు రామచంద్ర స్వామి, బాలసుబ్రహ్మణ్యంస్వామి తెలిపారు. పూర్వ అర్చకులు అప్పాస్వామి మనమరాలు యూఎస్ఏకు చెందిన రాధికరంగనాథ్ రాతిస్తంభాన్ని సమకూర్చారన్నారు. భక్తులు హాజరై కాశీవిశ్వేశ్వరుడి అనుగ్రహం పొందగలరన్నారు.

రహదారులు బాగుంటేనే అభివృద్ధి సాధ్యం


రోడ్డుపై గుంతలను పూడుస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రహదారులు బాగుంటేనే గ్రామాలు, ప్రజల అభివృద్ధి సాధ్యమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శనివారం మండలంలోని వైఎస్.గేటు నుంచి పూతలపట్టు హైవే వరకు ఉన్న రోడ్డులో గుంతల రహిత రహదారుల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో నాశనమైన రోడ్లను రాష్ట్ర వ్యాప్తంగా బాగు చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే స్వయంగా కంకర, తారువేసి గుంతలను పూడ్చారు. కార్యక్రమంలో నాయకులు గిరిధర్‌బాబు, హరిబాబు నాయుడు,ఎంఎస్.చౌదరి,మధుసూదన్‌రావు, హేమాద్రి నాయుడు, శ్రీధర్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

శ్రీరంగరాజపురం : 30 మద్యం బాటిళ్ల స్వాధీనం ఒకరిని అరెస్టు చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఆర్‌పురం మండలం చిన్నబాపనపల్లి గ్రామానికి చెందిన బుసిరెడ్డి(45) ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా బెల్ట్‌షాప్ నిర్వహిస్తుండగా, శనివారం రాత్రి సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా బుసిరెడ్డి వద్ద ఉన్న 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. ఎవరైనా బెల్ట్‌షాప్ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాడి ఆవు చోరీ

యాదమరి : మండలంలోని నర్రావూరు గ్రామంలో పాడి ఆవు చోరీ జరిగింది. నర్రావూరుకు చెందిన రైతు హరికృష్ణ తన పాడి ఆవును ఊరికి సమీపంలోని పొలంలో మేతకు వదలగా, శుక్రవారంసాయంత్రం నుంచి కనిపించలేదు. పాడి ఆవు చోరీపై స్థానిక పోలీసులకు బాధిత రైతు ఫిర్యాదు చేశారు. ఆవు రూ.75 వేలు విలువ చేస్తుందని రైతు వాపోయారు.

రహదారులు బాగుంటేనే అభివృద్ధి సాధ్యం


రోడ్డుపై గుంతలను పూడుస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రహదారులు బాగుంటేనే గ్రామాలు, ప్రజల అభివృద్ధి సాధ్యమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శనివారం మండలంలోని వైఎస్.గేటు నుంచి పూతలపట్టు హైవే వరకు ఉన్న రోడ్డులో గుంతల రహిత రహదారుల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో నాశనమైన రోడ్లను రాష్ట్ర వ్యాప్తంగా బాగు చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే స్వయంగా కంకర, తారు వేసి గుంతలను పూడ్చారు. కార్యక్రమంలో నాయకులు గిరిధర్ బాబు, హరిబాబు నాయుడు,ఎంఎస్.చౌదరి, మధుసూదన్‌రావు, హేమాద్రి నాయుడు, శ్రీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన సీఎన్ఆర్ కళాశాల విద్యార్థులు

గుడిపాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీఎన్ఆర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల అధినేత లోకేష్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు మెసానికల్ గ్రౌండ్‌లో జరిగిన అండర్-19 ఖోఖో పోటీల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న హరికాంత్, ఝాన్సీరాణిలు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారన్నారు. తిరుపతిలోని మంగళం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జరిగిన అండర్-17 బేస్‌బాల్ పోటీల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి చెందిన జ్యోత్స్న గుంటూరులో జరుగబోవు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. అదేవిధంగా దేవి విద్యామందిర్ పాఠశాల విద్యార్థులు అండర్-14 బేస్‌బాల్ జిల్లాస్థాయి పోటీల్లో 9వ తరగతి చదువుతున్న గౌతమ్, మనోజ్, 6వ తరగతి చదువుతున్న లిల్లీధర్ గుంటూరులో జరుగబోవు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధ, అర్జున్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సన్మానం


పదవీ విరమణ పొందిన వారితో ఎస్పీ మణికంఠ చందోలు, ఇతర అధికారులు

చిత్తూరు అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖకు మీరు అందించిన సుదీర్ఘ సేవలను పోలీసుశాఖ ఎప్పటికీ గుర్తించుకుంటుందని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. శనివారం పోలీసు అతిథి గృహంలోని కాన్ఫరెన్స్ హాలులో పదవీ విరమణ సన్మాన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ తరువాత ఎప్పుడు ఏ సమస్య వచ్చినా సంప్రదించాలని కోరారు. విశ్రాంత పోలీసులు, కుటుంబ సభ్యులు ఆరోగ్యపరంగా ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేశామని, వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం పదవీ విరమణ పొందిన హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌కుమార్(బైరెడ్డిపల్లె), వెంకటమ్మ(క్లాస్-4 ఉద్యోగిని, సాయుధ దళం)లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, ఆర్‌ఐలు, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్కంద షష్ఠి ఉత్సవాలు ప్రారంభం


విశేష అలంకరణలో కరకంఠేశ్వరస్వామి

నగరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కరకంఠేశ్వరస్వామి ఆలయంలో స్కంద షష్ఠి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం గణపతి పూజ, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వాములకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వాములవారికి పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించి ఆలయ ప్రదక్షిణ చేశారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. హారతి పూజలు, ఊంజల్‌సేవ నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యులు ఉభయదారులకు ఆలయ మర్యాదలు చేశారు. ఈ నెల 7న సూరసంహారం, 8న కల్యాణోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు.

వైభవంగా సహస్ర మోదక హోమం

పాలసముద్రం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగమాంబాపురంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీవినాయక స్వామి ఆలయంలో శనివారం మండల అభిషేకం సందర్భంగా అర్చక, వేదపండితులు సహస్ర మోదక హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1008 మోదకాలను పెట్టి రెండు కలశాలను ఏర్పాటు చేసి హోమాన్ని నిర్వహించారు. అనంతరం మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకం నిర్వహించి, లక్ష్మీవినాయక స్వామిని అత్యంత సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి బెంగళూరు నుంచి వందలాదిగా భక్తులు విచ్చేశారు.

వేద మంత్రోచ్ఛారణతో యాగశాల ప్రవేశం

చిత్తూరు కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామాలయంలో గత రెండు రోజులుగా స్వామి వారి వార్షిక పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. శనివారం స్వామివారి ఋత్వికులు, వేదపండితుల మంత్రోచ్చారణలతో రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, ద్వారాతోరణం, మహాకుంభం, పవిత్రమాల ధారణ, అగ్ని ప్రతిష్ఠ, శాతుమొర్రై, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమాల్లో ఈవో సుబ్రమణ్యం నాయుడు, అర్చక బృందం, స్థానికులు, భక్తులు, నగరవాసులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న సచివాలయాల పనులు పూర్తి చేయండి

బంగారుపాళ్యం, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లేడుపల్లె పంచాయతీలో అసంపూర్తిగా ఉన్న సచివాలయాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు సూచించారు. శనివారం ఆయన జిల్లేడుపల్లె సచివాలయాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయ నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేయగా, ఇప్పటికే చేపట్టిన పనులకు రూ.28 లక్షల మేర కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించిందన్నారు. మిగిలిన పనులు వెంటనే చేపట్టాలని ఎంపీడీవో శ్రీధర్, పీఆర్ ఏఈ కృష్ణలకు సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఏపీవో కిరణ్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారి హత్యపై ఎంపీ దిగ్ర్భాంతి

చిత్తూరు సిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలంలో చిన్నారి హత్యపై చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్ర్భాంతిని వ్యక్తం చేశారు. చిన్నారి హత్యకు కారకుడైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని పోలీసుశాఖకు విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

నింద్ర, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓరూరుపేటలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం గంధమనేని రాజేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ ఓరూరుపేటలో అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేయించి టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వర రావు, గంగాధరం నాయుడు, గజేంద్ర నాయుడు, రాము, గిరి, ప్రసాద్, మురళీ నాయుడు పాల్గొన్నారు.

అన్నదానం

వెదురుకుప్పం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. తిరుపతికి చెందిన కృష్ణమూర్తి వితరణతో మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ అధికారి సురేష్‌కుమార్ పర్యవేక్షించారు.

రోడ్డు పక్కన గుంతలు

- ప్రమాదాల బారిన వాహన చోదకులు


నారపరాజుకండ్రిగ వద్ద రోడ్డు పక్కనే వదిలేసిన మట్టి

విజయపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన తీసిన గుంతలతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నారపరాజు కండ్రిగ నుంచి కోసలనగరం వరకు రోడ్డు పక్కన ప్రైవేటు టెలికాం వారు విచ్చలవిడిగా గుంతలు తవ్వి పూడ్చకపోవడంతో రోడ్డుపైనే మట్టి ఉండిపోయింది. తేలికపాటి వర్షం కురిసినా మట్టి కరిగిపోయి ద్విచక్ర వాహనాలు జారి పడిపోతున్నాయని, దీంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న గుంతలను పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి పంట

- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు


నీట మునిగిన వరి పంటను చూపుతున్న మహిళా రైతు

బంగారుపాళ్యం, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు వరి పంట పూర్తిగా నేల వాలి, నీట మునిగి నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులకు వరి పంట పూర్తిగా దెబ్బతింది. మండలంలోని ముంగరమడుగు గ్రామానికి చెందిన మహిళా రైతు సమారియా, అములు పండించిన వరి పంట గాలీవానకు నేలకొరిగి నీట మునిగాయి. ఆరుగాలం కష్టపడి చేతికి అందే సమయంలో అకాల వర్షాలకు పంట నష్టపోయామని, ఈ-పంట కూడా నమోదు చేసుకున్నామన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని వారు వేడుకున్నారు.

అమెరికాలో నారా లోకేష్‌ను కలసిన పాలసముద్రం వాసులు



పాలసముద్రం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పెట్టుబడుల కోసం అమెరికాలో పర్యటిస్తున్న మంత్రి నారా లోకేష్‌ను పాలసముద్రం వాసులు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఎన్ఆర్ఐ కనెక్టివిటీ తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ కేతినేని వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పాలసముద్రం మండల వాసులు ఆయనను న్యూయార్కులో కలసి సన్మానించారు. వారు మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. పాలసముద్రం వాసులు రవీంద్ర నాయుడు, నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ


మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం నాయుడు, చెన్నకేశవుల నాయుడు

గుడిపాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, టీడీపీ సీనియర్ నేత గురజాల చెన్నకేశవుల నాయుడు అన్నారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ కార్యకర్తలకు సీఎం చంద్రబాబు, నారా లోకేష్ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యాన్ని కల్పించారన్నారు. గ్యాస్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మహిళలకు, కార్యకర్తలకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ

పెనుమూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో నవంబరు మొదటి వారం నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే నిర్వహించాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. పెనుమూరు మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లకు స్కిల్ డెవలప్‌మెంట్ సర్వేలో ఇంటింటికి వెళ్లి ఎలా సర్వే నిర్వహించాలో శనివారం శిక్షణ ఇచ్చారు. ఉదయం ఒక బ్యాచ్‌కు, మధ్యాహ్నం మరో బ్యాచ్‌కు శిక్షణ ఇచ్చారు. 15 ఏళ్ల నుంచి 59 ఏళ్లు ఉన్నవారికి స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే నిర్వహించాలన్నారు.

టీటీడీలో హిందుత్వ పరిరక్షణకు ప్రాధాన్యత


భానుప్రకాష్‌కు అభినందనలు తెలుపుతున్న చిట్టిబాబు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి హిందుత్వ పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చిందని బీజేపీ సీనియర్ నేత చిట్టిబాబు అన్నారు. టీటీడీ పాలకమండలి సభ్యుడిగా ఎన్నికైన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డిని శనివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన్ని కలిసిన వారిలో బీజేపీ నాయకులు సోమశేఖర్, సుబ్బారెడ్డి, హేమ శేఖర్, రెడ్డి మస్తాన్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

వెదురుకుప్పం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆరుగురు ఎంపికయ్యారని హెచ్ఎం ఎం.కేశవులు, వ్యాయామ సంచాలకులు తిరుమలరాజు శనివారం తెలిపారు. అండర్-14పోటీల్లో వినాయక, పావని, సాయి, సాయికిరణ్, అండర్-17లో శశిరాం, మౌళి, విజయదుర్గ ఎంపికయ్యారని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరచడం వల్ల వీరు ఎంపికైనట్లు తెలిపారు. శనివారం పాఠశాలల్లో ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు సరస్వతి, సుబ్రహ్మణ్యంరెడ్డి, రంజిత్‌కుమార్, వెంకటరమణయ్య, ఢిల్లీబాబు, చిన్నయ్యశెట్టి, మాలతి, సుమతి, హరిప్రకాష్ తదితరులు అభినందించారు.

స్కంద పురాణ పారాయణం పరమ పవిత్రం

చిత్తూరు కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో స్కంద పురాణం విన్నా, పారాయణం చేసినా ఎంతో పవిత్రమని ప్రముఖ ఆధ్యాత్మిక పురాణ ఇతిహాస పారాయణకర్త పయణి అన్నారు. చర్చివీధి జీవకారుణ్య అన్నదాన సమాజంలో శనివారం ఆయన స్కంద పురాణ పారాయణం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్తికేయునికి (సుబ్రమణ్యం స్వామి) కార్తీక మాసం బహు ప్రీతికరమని, ఈ మాసంలో మహేశ్వరుడి అనుగ్రహం భక్తులకు సిద్ధించాలంటే స్కంద పురాణం పారాయణం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఇ.ఆర్.ముత్తు కుమరవేల్, ఈవో తిమ్మారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బెల్ట్‌షాప్‌పై దాడి

- 30 మద్యం బాటిళ్ల స్వాధీనం

శ్రీరంగరాజపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): 30 మద్యం బాటిళ్లు స్వాధీనం ఒకరిని అరెస్టు చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు ఎస్ఆర్‌పురం మండలం చిన్నబాపనపల్లి గ్రామానికి చెందిన బుసిరెడ్డి(45) ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా బెల్ట్‌షాప్ నిర్వహిస్తుండగా, శనివారం రాత్రి సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడిచేశారు. ఈ సందర్భంగా బుసిరెడ్డి వద్ద ఉన్న 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. ఎవరైనా బెల్ట్‌షాప్ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాడి ఆవు చోరీ

యాదమరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రావూరు గ్రామంలో పాడి ఆవు చోరీ జరిగింది. నర్రావూరుకు చెందిన రైతు హరికృష్ణ తన పాడి ఆవును ఊరికి సమీపంలోని పొలంలో మేతకు వదలగా, శుక్రవారంసాయంత్రం నుంచి కనిపించలేదు. పాడి ఆవు చోరీపై స్థానిక పోలీసులకు బాధిత రైతు ఫిర్యాదు చేశారు. ఆవు రూ.75 వేలు విలువ చేస్తుందని రైతు వాపోయారు.

సంక్షిప్తంగా..

వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాల స్వామికి శనివారం క్షీరాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు కార్తీక్ అయ్యంగార్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అలంకరించారు. అనంతరం క్షీరాభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఏర్పాట్లను ప్రధాన కార్య నిర్వాహకులు శివకుమార్ పర్యవేక్షించారు.

రేపటి నుంచి కార్తీక సోమవారాల పూజలు

చిత్తూరు కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని శివాలయాల్లో సోమవారం నుంచి నాలుగు సోమవారాలు కార్తీక మాస పూజలు నిర్వహించనున్నారు. నీవానది పరివాహక ఒడ్డున వెలసిన కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరా, కాశీ విశ్వేశ్వర (రాజుగుడి), కట్టమంచి కులందేశ్వర, ఇరువారం నాగేంద్రస్వామి, గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక మాస సోమవార పూజలు నిర్వహించనున్నారు.

దేశమ్మను దర్శించుకున్న మాజీ మంత్రి రోజా



నగరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నేత్ర ప్రదాయణి దేశమ్మ కార్తీక మాసం దర్శన పూజలలో శనివారం వైసీపీ అధికార ప్రతినిధి, మాజీమంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. పూజారులు ఆమెకు ఆలయ మర్యాదలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు వేణుబాబు, దయానిధి, కౌన్సిలర్ ఇంద్రయ్య, కోఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

వైసీపీ మండల అధ్యక్షుడిగా ప్రకాష్

గుడిపాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల వైసీపీ అధ్యక్షుడిగా రాసనపల్లి ప్రకాష్ నియమితులయ్యారు. గతంలో మండల వైసీపీ అధ్యక్షుడిగా కనకం జనార్దన్ వ్యవహరించేవారు. అధికారం కోల్పోయిన తర్వాత మండలంలోని రాసనపల్లి దళితవాడకు చెందిన ప్రకాష్‌ను ఆ పార్టీవర్గాలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం తిరుపతిలో అధికారికంగా ప్రకటించనున్నారు.

జడ్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సీఈవో

చిత్తూరు సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయాన్ని సీఈవో రవి నాయుడు శనివారం తనిఖీ చేశారు. జడ్పీ కార్యాలయంలోని వివిధ విభాగాలకు వెళ్లి ఉద్యోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటి పనులు అప్పుడు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని ఉద్యోగులను ఆదేశించారు.

విద్యా సామగ్రి పంపిణీ

విజయపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టకండ్రిగ ప్రాథమిక పాఠశాలలో శనివారం రిటైర్డు ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఒకటి నుండి ఐదువరకు చదువుతున్న విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, నోటు పుస్తకాలు వితరణగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దివ్య, విద్యా కమిటీ చైర్మన్ హేమలత, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ముత్తు, శివానందం పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మించుకోవాలి


బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

చిత్తూరు సెంట్రల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజాన్ని నిర్మించుకోవాలని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ రాములు అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా శనివారం కొంగారెడ్డిపల్లిలోని ఎంసీహెచ్ స్కూల్లో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పోటీలు నిర్వహించింది. అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం విజిలెన్స్ విభాగంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం గీతాంజలి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం బరకతుల్లా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశుగణన పక్కాగా చేయాలి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గత నెల 25న ప్రారంభమైన 21వ జాతీయ పశుగణన పక్కాగా చేపట్టాలని ఆ శాఖ జేడీ ప్రభాకర్ అన్నారు. శనివారం గుడిపాల, బంగారుపాళ్యం తదితర మండలాల్లో ఎన్యుమరేటర్లు చేపడుతున్న పశుగణన విధానాన్ని పరిశీలించారు. ప్రతి పాడి రైతు ఇంటికి వెళ్లి ఖచ్చితమైన లెక్కలు నమోదు చేయాలని సూచించారు. రోజు వారీ సమాచారాన్ని జిల్లా కార్యాలయానికి పంపాలన్నారు. మండల పశువైద్యాధికారులు పశుగణనలో కీలక పాత్ర పోషించాలన్నారు.